క్లుప్తంగా

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



వీపనగండ్ల: రైతులు ఆయిల్‌పాం తోటలు సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి దాకేశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పుల్గర్‌చర్లలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహ కల్పించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వ పరంగా మొక్కలు, డ్రిప్ వసతిని కల్పిస్తామని మిగతా రైతులకు సబ్సిడీ ద్వార మొక్కలను అందజేస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాన్‌గల్ ఎస్‌ఐగా రవిప్రకాష్



పాన్‌గల్: మండల నూతన ఎస్‌ఐగా ఎస్ రవిప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నాగన్న వనపర్తి రూరల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో మహబూబ్‌నగర్ టుటౌన్ ఎస్‌ఐగా పనిచేసిన రవిప్రకాష్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలి



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అన్ని గ్రామాల్లో మురికి కాలువ చివర ఉన్న ఖాళీ స్థలంలో సామూహిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ అఫ్జల్ అన్నారు. శుక్రవారం మండలంలోని బలిజపల్లి, గట్లఖానాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటు పనులను ఎంపీడీఓ పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, అప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అనంతరం పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం రెండు పూటల నీళ్ల పట్టాలని నిర్వాహకులకు సూచించారు. వచ్చే హరితహారంలో నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉంచామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



అమరచింత: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న బాలస్వామి, అరుణ, కె.కృష్ణయ్య, హరిత ను శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా, సీఆర్పీ స్వామి, ఉపాధ్యాయులు రమేష్, కిరణ్, బాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ ఆఫీసర్‌కు..



వనపర్తి టౌన్: ఫ్లయింగ్ ఆఫీసర్‌గా రాష్ట్రపతి చేతుల మీదుగా కమిషన్ ఆర్డర్ పొందిన నిఖిల్ సాయిని శుక్రవారం ఎంపీపీ మేఘారెడ్డి శాలువా, బొకే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మెగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నిఖిల్ సాయి ఒక్కడే నియమితులు కావడం వనపర్తికి గర్వకారమన్నారు. నిఖిల్ తల్లిదండ్రులు కౌన్సిలర్ చంద్రకళ, ఎల్‌ఐసీ కృష్ణ ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి, సతీష్, సర్పంచ్ తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ సతీష్, వెంకటేశ్వర్లు, జానంపేట రాములు, గట్టు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి శివారులో విద్యుతాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి మండలం చందాపూర్‌కు చెందిన రైతు నాగమోని నిరంజన్ తన గేదెలను మల్లాయిపల్లి శివారులోకి మేత కోసం తీసుకెళ్లగా పంట పొలాల్లో తెగి పడిన విద్యుత్ తీగకు తగిలి గేదె మృత్యువాత పడినట్లు రైతు పేర్కొన్నారు. దీని విలువ దాదాపుగా రూ.70వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే ప్రధానం

- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రెడిట్‌కార్డు మంజూరు
- ఫైలెట్ ప్రాజెక్టుగా రేవల్లి మండలం ఎంపిక



తల్పునూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపాల్‌పేట: రైతుసాతి క్రెడిట్ కార్డు ఉపయోగించుకోవడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుసాతి క్రెడిట్‌కార్డు ఫైలెట్ ప్రాజెక్టులో భాగంగా రేవల్లి మండలాన్ని ఎంపిక చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ క్రెడిట్‌కార్డులను వినియోగించుకోవడం ద్వారా రైతులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని తెలిపారు. రేవల్లి మండలంలోని తల్పునూరులో ఏఓ మాట్లాడుతూ.. అధికవడ్డీ రేట్లకు రైతులు తీసుకున్న అప్పులు తీర్చుకునేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్డును వినియోగించుకున్న తర్వాత పంటమీద రుణాన్ని కట్టుకోవచ్చని వివరించారు. సులభతరమైన సర్టిఫికెట్లతో ఈ కార్డును రైతులు పొందవచ్చన్నారు. కార్డు తీసుకోవడం ద్వారా రైతులు పంట పెట్టుబడి సమయంలో ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రీజినల్ మేనేజర్ నర్సింహ తెలిపారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన

వీపనగండ్ల: రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలపై అవగాహన కల్పించేందుకు శనివారం కృషి విజ్ఞాన కేంద్రం, మదనాపురంలో జాతీయ ఉద్యాన పంటల సంస్థ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యానవన అధికారి కృష్ణయ్య తెలిపారు. పండ్ల తోటల పెంపకం వల్ల రైతులు రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వివిధ పంటలకు అందుతున్న సబ్సిడీలు, ఉద్యానపంటల సాగుపై మెలకువలు, కూరగాయలు, పండ్లు, పూల తోటలు, మొదలైన పంటల పెంపకం వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు సురేష్‌కుమార్ సూచనలు సలహాలు ఇస్తారని కావున మండలంలోని రైతులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు అందజేయాలి



వీపనగండ్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అసత్య ప్రచారాలు చేస్తూ పేదలను మభ్యపెడుతున్న మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పి నేటికీ ఆ హామీని నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. దళితబంధు, కుల వృత్తులకు రూ.లక్ష పేరుతో సామాన్య ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పాండునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలీ, నాయకులు కృష్ణయ్య, మహబూబ్‌పాష, ఆశన్న, రాంచంద్రయ్య, రాములు, బాలయ్య గౌడ్, శాంతమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

పాన్‌గల్: ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాడుతామని ప్రజా సంఘాల ఐక్య వేదిక పోరాట నాయకులు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ దేవేందర్, సీఐటీయూ జిల్లా నాయకుడు రాము అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు దావాజిపల్లి, దొండాయిపల్లి గ్రామాల్లో ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వారికి కేటాయించాలని, సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, అర్హులైన వారికి దళితబంధు ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో స్వామి, బండలయ్య, నర్సింహ, రంగస్వామి, మల్లేష్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈర నాగమ్మ గుడికి విరాళం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో యాదవుల కుల దేవతలు అయిన ఈరనాగమ్మ, ఎల్లమ్మ దేవతల ఆలయాల నిర్మాణానికి పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. అడిగిన వెంటనే స్పందించి విరాళం అందించిన ఎంపీపీకి కురుమన్న, సుధాకర్ యాదవ్, చంద్రయ్య, మన్యం కృతజ్ఞతలు తెలిపారు.

డంపింగ్‌యార్డు తొలగించండి

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డు కాలనీకి ఆనుకొని ఉండడంతో చెత్త కాల్చినప్పుడు చిన్న పిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు.

క్రైస్తవుల్లో రాజకీయ చైతన్యం రావాలి

కొత్తకోట: రాష్ట్రంలోని క్రైస్తవుల్లో సామాజిక, రాజకీయ చైతన్యం రావాలని క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జనంపల్లి షమియాసోన్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల్లో సామాజిక చైతన్యం లేకపోవడం వలన ప్రభుత్వాలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్రైస్తవులకు అందడం లేదని, వారి సమస్యలపై స్పందిస్తూ పోరాడుతున్న క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేదికను ప్రతి ఒక్క క్రైస్తవులు బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో శాంతిప్రసాద్, జాన్సన్, తిమోతి, చంద్రబాబు తదితరులు ఉన్నారు.

ఈద్గాలో వసతులు కల్పించండి

అమరచింత: బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో వసతులను కల్పించాలంటూ మున్సిపల్ ఆర్ఐ కృష్ణయ్యకు మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు తౌఫిక్, నిస్సార్, అక్బర్, పాషా, అశు, నయ్యర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి



గోపాల్‌పేటలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి, వెంగళాయిపల్లి గ్రామాలల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో టీబీ వ్యాధి నివారణపై శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించడంతో పాటు అనుమానితుల నుంచి తెమడను సేకరించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమనశ్రీ, ఏఎన్ఎంలు సుమిత్ర, శైలజ, రమాదేవి, రాంచందర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ క్లైవెన్‌మార్క్ అన్నారు. శుక్రవారం ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, తక్కువ సమయంలోనే బరువు తగ్గిపోవడం, తెమడలో రక్తం పడటం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాకాంత్, వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జమ్మాపూర్‌లో ఉపాధ్యాయులతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనంతో పాటు మెరుగైన విద్య అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాశేఖరచారి, సీఆర్పీ గోవింద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బీజేపీ బహిరంగసభ జయప్రదం చేయండి



వనపర్తిలో శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



వెల్టూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: సీఎం కేసీఆర్ అవినీతి పాలన వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ నాయకుడు బి. కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి బీజేపీ అనే కార్యక్రమం శుక్రవారం జిల్లా కేంద్రంలో కొనసాగింది. కార్యక్రమంలో నారాయణ, పెద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌కు ఘన నివాళి

జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జింకల కృష్ణయ్య, శ్రీశైలం, సుమిత్రమ్మ, గోర్ల బాబురావు, పెద్దిరాజు, ఎండీ కరీం తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్లు విడుదల

నాగర్‌కర్నూల్‌లో ఈనెల 25న నిర్వహించే జేపీ నడ్డా నవసంకల్ప సభకు జిల్లా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమారస్వామి, నాయకులు పెద్దిరాజు, రాములు, రాయన్న సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గకొకన్వీనర్ రేచింతల శ్రీనివాస్, జిల్లాఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండలంలోని గుంటిపల్లి, బాలకిష్టాపూర్, మెడేపల్లి, దేవరపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 29న పట్టణంలో నిర్వహించనున్న బహిరంగ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లన్న, రాజు, ఆనంద్, రఘు, శేషు, తమ్ముళి వెంకటేష్, భీంరెడ్డి, బాలకృష్ణ, సమద్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని ప్రతి ఇంటికి చేరాయని బీజేపీ మండల అధ్యక్షుడు హరీష్ తెలిపారు. శుక్రవారం బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 3కోట్ల గృహాలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, భీంరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

పెబ్బేరు: ప్రధానిగా నరేంద్రమోడీ పాలన తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గిరెడ్డి మాధవరెడ్డి, కసిరెడ్డి వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షుడు భగవంతు యాదవ్, బొజ్జన్న, రాములు, సత్యంసాగర్, లక్ష్మన్న, శంకర్, శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో దేశంలో 9ఏళ్ల బీజేపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహేష్, మోహన్, నరేష్, ఆనంద్, చిన్న, కృష్ణ ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో బీజేపీ నాయకులు కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ తమ సొంత నిధులుగా చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమచ అభివృద్ధి పథకాల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



అయ్యవారిపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీలు వేస్తున్న చిన్నారెడ్డి

పెబ్బేరు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, కార్యకర్తలు కలికట్టుగా పని చేయాలని సూచించారు. అలాగే యాపర్ల, గుమ్మడం, గుమ్మడంతండా, తిప్పాయిపల్లి, అయ్యవారిపల్లి, పాతపల్లి గ్రామాల్లో కమిటీలు వేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌సాగర్, నరేందర్, రామిరెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

నియోజకవర్గంలో సీఆర్‌తోనే కాంగ్రెస్ బలోపేతం

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గంలో సీఆర్ జగదీశ్వర్‌రావుతోనే కాంగ్రెస్ బలోపేతం అయిందని దీనిని దృష్టిలో ఉంచుకొని అధిష్టానం వచ్చే ఎన్నికల్లో ఆయనకే పార్టీ టికెట్ కేటాయించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి ఊపిరి పోసి కాపాడిన వ్యక్తి సీఆర్ జగదీశ్వర్‌రావు అనే విషయం అధిష్టానం గుర్తించాలన్నారు. సమావేశంలో మాందాపూర్ ఉప సర్పంచ్ బాలరాజు, కృష్ణ, నర్సింహానాయుడు, సుధాకర్‌యాదవ్, స్వామి, మాజీ సర్పంచ్‌లు బాలస్వామి, చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ బుచ్చారెడ్డి, నాగేష్‌నాయక్, రోహిత్‌సాగర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎస్తేర్ రాణి (28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎస్తేర్ రాణి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో భక్తరాజు, మహిమరాజు, సతీష్ రాజు, చంద్రమోహన్, విజయ్, సతీష్, దిలీప్, చిన్న, మోహన్ తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వీరాయిపల్లికి చెందిన క్యాసాని బాలయ్య కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. బాలయ్య ఆర్థిక పరిస్థితిని టీఎమ్మార్ యువజన సభ్యులు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం వీరాయిపల్లికి చేరుకొని బాలయ్యను పరామర్శించి రూ.5వేలు సాయం అందజేశారు. రానున్న రోజుల్లో బాలయ్య కుటుంబానికి అండగా ఉంటానని మే ఘారెడ్డి భరోసా ఇచ్చినట్లు టీఎమ్మార్ సభ్యులు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి: ఏబీవీపీ

వనపర్తి టౌన్: పెండింగ్‌లో ఉన్న రూ. 5,300 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం – మహా ఉద్యమం మూడు రోజుల విస్తరక్ యోజనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రం వచ్చాక సమస్యలు తీరుతాయన్న ప్రజల ఆశలపై సీఎం కేసీఆర్ నీళ్లు చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం పాలనతో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్లు విడుదల కాక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జగదీశ్, బాలకృష్ణ, శివ, శ్రీకాంత్, కేదర్‌నాథ్, వంశీ పాల్గొన్నారు.

కేజీబీవీలో సీట్ల సంఖ్య పెంచాలని వినతి

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి సమీపంలోని కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం సీట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్ఓ స్వప్నరాణికి శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, తౌఫిక్, ప్రకాశం, పోషిరిగారి విష్ణు, నాగు నాయక్, హన్మంత్ నాయక్, పోతు శ్రీధర్ ఉన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

నియోజక వర్గ స్థాయిలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో మండలంలోని యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం పోటీలకు సంబంధించిన బ్రోచర్లు విడుదల చేశారు.

మసీద్ అధ్యక్షుడిగా ఖలీల్

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలోని మసీద్ సయ్యదీయ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖలీల్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా రఫీక్, ఉపాధ్యక్షుడిగా అన్వర్‌పాష తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఆలీ, మఖ్బూల్, షాలం, మైనొద్దీన్, అజీం, షోయబ్, హఫీజ్, బషీర్, అజ్హర్, అబ్దుల్, హమ్మద్, ఇమ్రాన్, సెంట్రింగ్ రఫీ తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్ మృతి

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్ పెద్ది బాలరాజు గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. పాఠశాల అభివృద్ధి కోసం అహర్నిశలు తపించే బాలరాజు మృతిపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. పలువురు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ నిరసన



అమరచింతలో నిరసనకారులతో మాట్లాడుతున్న డీటీ అనురాధ

అమరచింత: 25ఏళ్ల కిందట ఇంటి నిర్మాణాల కోసం ఇచ్చిన పట్టాలకు స్థలాల పొజిషన్ చూపాలని, గృహలక్ష్మి పథకాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలంటూ పేదలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మండలంలోని ఆయా గ్రామాల నుంచే కాకుండ పట్టణానికి చెందిన పలువురు మహిళలు భారీగా తరలి వచ్చి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి మాట్లాడుతూ అర్హులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇచ్చి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని దుంపాయికుంటలో లబ్ధిదారులు తమకు ఇచ్చిన ఇంటి పట్టాల ప్రకారం స్థలం ఎక్కడుందో చూపాలని పది నెలలుగా అక్కడే గుడిసెలు వేసుకొని జీవిస్తున్న స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ధర్నాను విరమించలేమని భీష్మించారు. అనంతరం ఆర్‌డీఓ పద్మావతితో డీటీ అనురాధ ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడించారు. మంగళవారం నాటికి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, స్వయంగా దుంపాయి కుంటను పరిశీలిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ రమేష్, అజయ్, వెంకటేష్, బుచ్చన్న, అనంతమ్మ, ఆకాశవేణి, కురుమూర్తి, రాఘవేంద్ర, చంటి, రాఘవ పాల్గొన్నారు.

మదనాపురం: ప్రభుత్వం పేదలందరికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాసంఘాల పోరాట వేదిక, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, ప్రజానాట్య మండలి, యువజన సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో పేదలపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి జీఓనంబర్ 58 ప్రకారం పట్టాలు ఇవ్వాలని, అన్ని గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నరేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాజు, వెంకట్రాములు, చెన్నయ్య, వెంకటేష్, చిరంజీవి, ప్రసాద్, విష్ణు, సత్యన్న, మణివర్ధన్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com